PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 52, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 12 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...!



ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం

శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు

## శాంతి చర్చల వేళ చైనాపై అమెరికా సంచలన ఆరోపణ!

డ్రాగన్ కంట్రీ ఇరాన్‌కు రహస్యంగా విమాన విధ్వంసక క్షిపణులను సరఫరా చేస్తోందని ఆరోపన



అమెరికా నిఘా వర్గాల ప్రకారం.. చైనా నుంచి ఇరాన్‌కు మ్యాన్‌ప్యాడ్స్ అందుతున్నాయి

ఒకవేళ యుద్ధం మళ్లీ మొదలైతే ఈ క్షిపణులు అమెరికా విమానాలకు పెను ముప్పుగా మారతాయని ఆందోళన

## ప్లాన్ బీ లేదు.. ఇరాన్‌తో చర్చలకు ముందు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



ఇరాన్ సైనిక శక్తిని తాము పూర్తిగా దెబ్బతీశామని, అందుకే ప్లాన్ బీ అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం

పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఉన్నతస్థాయి చర్చలు

"వారు మాతో ఆడుకోవాలని ప్రయత్నిస్తే, మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండదు" అని స్పష్టం



## జగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సమాధానమిస్తుంది: సీఎం చంద్రబాబు

అమరావతి: పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. పార్టీ నాయకుల శిక్షణ తరగతుల్లో సీఎం స్వయంగా పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కొద్దిసేపు ముచ్చటించారు. "జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుంది" అని సీఎం స్పష్టం చేశారు

# పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి

## 'జీ3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) అనే ప్రత్యేక కార్యక్రమం

- ★ గతంలో కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి
- ★ క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి
- ★ 'క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్న మనం, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం
- ★ టీడీపీ కార్యాలయంలో శిక్షణా తరగతులు... క్రమం తప్పకుండా హాజరవుతున్న చంద్రబాబు
- ★ గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరిస్తున్నారు



అమరావతి: ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన క్రమం తప్పకుండా హాజరవుతూ పార్టీ శ్రేణులకు ఆదర్శంగా మిగతా..2లో



## జగన్ పేరులో 'గన్' ఉంది, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉంది

- "ఎంతసేపు గన్నులు, గొడ్డళ్లేనా? నరకాలి, చంపాలి, నాశనం చేయాలనే ఆలోచిస్తారా?
- పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి: షర్మిల సెటైర్
- జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ఆలోచనను పూర్తిగా అపహాస్యం చేసిన షర్మిల



## బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం: కల్వకుంట్ల కవిత

- కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉధృత పోరాటం చేస్తాం
- పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై చర్చ
- స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తా
- కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదు

## మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనం

- బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు
- బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం
- చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు
- బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోంది



ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు మిగతా..2లో

# హర్మ్యూజ్‌లో కొత్త చిక్కు

: సీమైన్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో.. ఇరాన్‌కు తెలియదట!

పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రపంచం హర్మ్యూజ్ జలసంధి పేరు తలవని రోజు లేదు

ఆ జలమార్గంలో వాటిని ఏర్పాటుచేసిన ఆ దేశానికే ఇప్పుడు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియదట..!




ఇరాన్ వాటిని చెల్లాచెదురుగా పరిచిందని, వాటిని ఉంచిన స్థానాలను రికార్డు చేసిందో లేదో, తెలియని పరిస్థితి నెలకొందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ మిగతా..2లో



## పార్లమెంటు ప్రాంగణంలో అరుదైన దృశ్యం..

- మోదీ, రాహుల్ గాంధీ సంభాషణ..!
- దేశ రాజకీయాల్లో ఉప్పు-నిప్పులా ఉండే ప్రధానమంత్రి మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- పార్లమెంట్ ప్రాంగణంలో ఒకరినొకరు పలకరించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి
- ప్రధాని ఏదో అడుగుతుండగా రాహుల్ దానికి సమాధానం



## రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు
- అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని
- ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయం
- మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నారు

హైదరాబాద్: తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని మిగతా..2లో




## జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

- జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఖరారు
- సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు
- సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు పార్టీ ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో పర్యటన
- తెలంగాణ గడ్డపై కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం

# అందమైన ముసుగులో చేస్తున్న మోసం

## వారిని ఎలా గెంటేశారో అందరికీ తెలుసు

- ★ బీజేపీ పెడుతున్న ఈ మెలికల్లో వారి రాజకీయ స్వార్థం దాగుంది
- ★ లోక్‌సభ సీట్ల పెంపుతో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయి
- ★ ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు
- ★ అప్పుడు బండి, కిషన్‌రెడ్డిలకు చప్రాసీ పదవి కూడా దొరకదు




హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు అవమానం జరిగిందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని రేవంత్‌రెడ్డి విముర్శియిచారు. 'గతంలో బీఆర్ఎస్‌లో సీనియర్లుగా ఉన్న ఆలె నురేంద్ర, దేశిని చిన్న మల్లయ్య, ఈటల రాజేందర్, విజయశాంతి లాంటి మిగతా..2లో

# 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...!

ఢిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం. భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు 'ఇండియా నరేటివ్' తన కథనంలో వివరాలను వెల్లడించింది. ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను (ూతఅ-ూఎవం/ూతీము ణవఅఖుఙ్రీ -ూ2/ూణ) పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన ూ2/ూణ వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి. భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## శాంతి చర్చల వేళ చైనాపై అమెరికా సంచలన ఆరోపణ!

ఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల వేళ అమెరికా తన నిఘా వర్గాలను ఉటంకిస్తూ చైనాపై సంచలన ఆరోపణలు చేసింది. డ్రాగన్ కంట్రీ ఇరాన్‌కు రహస్యంగా విమాన విధ్వంసక క్షిపణులను సరఫరా చేస్తోందని ఆరోపించింది. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం ఇరాన్‌తో చర్చలకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ఆరోపణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికా నిఘా వర్గాల ప్రకారం.. చైనా నుంచి ఇరాన్‌కు మ్యాన్‌ప్యాడ్స్ అందుతున్నాయి. భుజంపై నుంచి ప్రయోగించే ఈ క్షిపణులు తక్కువ ఎత్తులో ప్రయాణించే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను సులభంగా కూల్చివేయగలవు. అంతర్జాతీయంగా విమర్శలు రాకుండా ఉండేందుకు చైనా ఈ ఆయుధాలను నేరుగా కాకుండా మూడో దేశం ద్వారా ఇరాన్‌కు చేరవేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ సమయాన్ని ఇరాన్ తన ఆయుధ సంపత్తిని తిరిగి సమకూర్చుకోవడానికి ఉపయోగించుకుంటోందని అమెరికా అనుమానిస్తోంది. ఒకవేళ యుద్ధం మళ్లీ మొదలైతే ఈ క్షిపణులు అమెరికా విమానాలకు పెను ముప్పుగా మారతాయని ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో 'మమ్మల్ని మోసం చేయాలని చూడొద్దు' అని జేడీ వాన్స్ ఇప్పటికే ఇరాన్‌ను గట్టిగా హెచ్చరించారు. అయితే, ఈ ఆరోపణలను చైనా ఖండించింది. తాము ఏ దేశానికీ ఆయుధాలు సరఫరా చేయడం లేదని, బాధ్యతాయుతమైన దేశంగా శాంతి చర్చలకే మద్దతిస్తామని వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఈ తాజా పరిణామాలతో ఇస్లామాబాద్ చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. చైనా తన వైఖరి మార్చుకోకపోతే, వచ్చే నెలలో జరగాల్సిన ట్రంప్-జిన్‌పింగ్ భేటీపైనా దీని ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్లాన్ బీ లేదు.. ఇరాన్‌తో చర్చలకు ముందు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఉన్నతస్థాయి చర్చలు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. అయితే, ఈ చర్చలు విఫలమైతే తమ వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక (ప్లాన్ బీ) లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సైనిక శక్తిని తాము పూర్తిగా దెబ్బతీశామని, అందుకే ప్లాన్ బీ అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ చర్చల కోసం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చీలతో కూడిన ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. వారికి పాకిస్థాన్ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ స్వాగతం పలికారు. అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. పారిస్ నుంచి బయలుదేరే ముందు వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. "వారు మాతో ఆడుకోవాలని ప్రయత్నిస్తే, మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండదు" అని స్పష్టం చేశారు. గత కొన్ని వారాలుగా క్షిపణి దాడులతో అట్టుడికిన గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం రెండు వారాల కాల్పుల విరమణ అమలవుతోంది. ఈ ప్రశాంత వాతావరణంలోనే చర్చలు జరుగుతున్నప్పటికీ, అమెరికా తన బలగాలను పశ్చిమాసియాలో మరింతగా మోహరించడం ఉద్రిక్తతలను పెంచుతోంది. చర్చలకు ముందే ఇరు దేశాలు తమ తమ డిమాండ్లతో ముందుకు వచ్చాయి. అమెరికా 15 పాయింట్ల ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించగా, ఇందులో ఇరాన్ తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను అప్పగించాలని, సైనిక పరిమితులను అంగీకరించాలని షరతులు విధించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ 10 పాయింట్ల ప్రణాళికను పంపింది. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని అమెరికా గుర్తించాలని కోరింది. "ఇరాన్ సైన్యం ఓడిపోయింది. వారి వద్ద కొన్ని క్షిపణులు, పరిమిత తయారీ సామర్థ్యాలు మాత్రమే ఉన్నాయి. మా సైన్యం అద్భుతంగా పని చేసింది. వారిని గట్టిగా దెబ్బతీశాం" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. మరోవైపు వచ్చే వారం లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య కూడా చర్చలు జరగనుండటం ఈ ప్రాంతంలో దౌత్యపరమైన ప్రయత్నాలకు సూచికగా నిలుస్తోంది.

# బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# జగన్ పేరులో 'గన్' ఉంది, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉంది

అమరావతి: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏపీ రాజధానికి 'మావిగన్' అని పేరు పెట్టాలన్న జగన్ ప్రతిపాదనను ఆమె తీవ్రంగా ఎగతాళి చేశారు దీనికి కౌంటర్‌గా, పులివెందుల నియోజకవర్గానికి 'అవి గొడ్డలి' అని పేరు మార్చాలంటూ సంచలన సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపాయి. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ఆలోచనను పూర్తిగా అపహాస్యం చేసిన షర్మిల, వైసీపీ సిద్ధాంతంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎంతసేపు గన్నులు, గొడ్డళ్లేనా? నరకాలి, చంపాలి, నాశనం చేయాలనే ఆలోచిస్తారా?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ పేరులో 'గన్' ఉందని, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉందని, వారి ఆలోచనా విధానం కూడా హింస చుట్టూనే తిరుగుతుందని ఆమె ఆరోపించారు. వివేకా హత్య కేసును పరోక్షంగా ప్రస్తావిస్తూ, "అమరావతికి మీ పేరు మీద 'మావిగన్' అని పెడితే, పులివెందులకు అవినాష్ రెడ్డి పేరు మీద 'అవి గొడ్డలి' అని పెట్టాలి" అని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని అమరావతి కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని షర్మిల విమర్శించారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చివేయడంతోనే పాలన మొదలుపెట్టారని గుర్తుచేశారు. "ఇప్పుడు అమరావతి వద్దు, మావిగన్ పెడతారట. ఈ ఐడియా అంత అద్భుతంగా ఉంటే, ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అమలు చేయలేదు?" అని ఆమె నిలదీశారు. 'మావిగన్'కు ఖర్చు తక్కువైతే, మరి మూడు రాజధానుల ప్రతిపాదన ఎందుకు తెరపైకి తెచ్చారని ప్రశ్నించారు. జగన్ 'మావిగన్' ప్రతిపాదనపై తమ వైఖరి ఏంటని అడుగుతున్నారని, ఎవరైనా ఓ జోక్ వింటే గట్టిగా నవ్వాలి తప్ప స్పందించాల్సిన అవసరం లేదని ఆమె కొట్టిపారేశారు. ఇదే సందర్భంలో, గతంలో నిండు సభలో వైఎస్ విజయమ్మను అవమానించినందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఎంత ఏడ్చినా తక్కువేనని కూడా షర్మిల వ్యాఖ్యానించారు.

# పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి

మొదటి పేజి తరువాయి

పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో, పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఆర్థిక స్వావలంబన కోసం 'జు3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరాల్లో చంద్రబాబు చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతూ, వారితో నేరుగా సంభాషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, పరిపాలన అంశాలపై తన సుదీర్ఘ అనుభవాన్ని పంచుకుంటున్నారు. గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరుపై కార్యకర్తల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్న మనం, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి. గతంలో కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి," అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. కార్యకర్తల ఆర్థిక బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "పార్టీ నేతలు, కార్యకర్తల కోసం జు3 ప్రోగ్రాం తీసుకొస్తాం. నీతి, నిజాయతీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' కార్యక్రమం చేపడతాం" అని హామీ ఇచ్చారు. "నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచించానో, టీడీపీ కుటుంబం కోసం కూడా అదే విధంగా ఆలోచిస్తున్నాను" అని ఆయన పేర్కొనడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రత్యర్థి పార్టీల తీరును సమర్థంగా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

# అందమైన ముసుగులో చేస్తున్న మోసం

మొదటి పేజి తరువాయి

ఎంతోమందికి ఏం జరిగిందో, వారిని ఎలా గెంటేశారో అందరికీ తెలుసు..' అని వ్యాఖ్యానించారు. 'నియోజకవర్గాల పెంపు అనేది అందమైన ముసుగులో చేస్తున్న మోసం. బీజేపీ పెడుతున్న ఈ మెలికల్లో వారి రాజకీయ స్వార్థం దాగుంది. గతంలో ఇలాగే హడావుడి చేసి రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చారు. రైతుల ఆందోళనతో మళ్లీ వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లుపై సౌత్‌లో రియాక్షన్ వస్తే, బీజేపీ పాలిత చిన్న రాష్ట్రాలు సహా.. ఇతర చిన్న రాష్ట్రాలు వ్యతిరేకిస్తే కేంద్రం ఏం చేస్తుంది? ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపు (పునర్విభజన)తో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని, ఫలితంగా ప్రజా ఉద్యమాలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు చట్టాల్లాగే డీలిమిటేషన్ బిల్లును కూడా వెనక్కి తీసుకోకతప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర ద్రోహం చేస్తోందని అన్నారు. ఈ రాష్ట్రాలను రాజకీయంగా అణగదొక్కే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఇది పార్టీల సమస్య కాదని, ప్రాంతాల సమస్య అని చెప్పారు. 'ఇప్పటికే మేము తీవ్రమైన బాధతో ఉన్నాం.. గాయపడి ఉన్నాం.. మమ్మల్ని ఇంకా రెచ్చగొట్టొద్దు' అని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లను దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ అమలు చేశారు. సోనియాగాంధీ గతంలోనే మహిళా రిజర్వే షన్ బిల్లును పెట్టారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల కోసం సీట్లు పెంచాల్సిన అవసరం ఏముంది? ఇప్పుడున్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 సీట్లను మహిళలకు కేటాయించి రిజర్వేషన్లు అమలు చేయొచ్చు కదా? కేంద్రం లీకులు ఇస్తున్న ఇతర సవరణలపై ఇండియా కూటమితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయించాం..' అని రేవంత్ తెలిపారు. 'నియోజకవర్గాలను ఏ ప్రాతిపదికన, ఎలా పెంచాలి అనే దానిపై కనీస చర్చ లేకుండా ఎందుకింత అర్జెంటుగా? దేశంలో 50 శాతం నియోజకవర్గాల పెంపు జరిగితే ఉత్తరాదికే పూర్తి అడ్వాంటేజ్‌గా మారుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దుస్థితి వస్తుంది. చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా ప్రాముఖ్యత కోల్పోతాయి. చిన్న రాష్ట్రాలు మరింత చిన్నగా, పెద్ద రాష్ట్రాలు మరీ పెద్దగా మారిపోతాయి. ఆర్థిక ప్రాతిపదికన, మెరిట్ డిజబిలిటీ విధానంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పెంపు ఉండాలి. చిన్న రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాల మధ్య ఇప్పుడున్న గ్యాప్ అలాగే కొనసాగాలి. ప్రస్తుతం కేరళ, యూపీ మధ్య 60 సీట్ల తేడా ఉంది. పునర్విభజన జరిగితే అది ఏకంగా 99కి పెరుగుతుంది. ఇది ముమ్మాటికీ చిన్న రాష్ట్రాలకు ఉరితాడు లాంటిదే. భవిష్యత్తులో ఉత్తరాది సీట్లు పెరిగితే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చోటు దక్కించుకున్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి లాంటి దక్షిణాది బీజేపీ నేతలకు కనీసం చప్రాసీ పదవి కూడా దొరకదు..' అని సీఎం అన్నారు.

# హర్మూజ్‌లో కొత్త చిక్కు

మొదటి పేజి తరువాయి

అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి

ఢిల్లీ: పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రపంచం హర్మూజ్ జలసంధి పేరు తలవని రోజు లేదు. రెండు వారాల సీజ్ ఫైర్ మొదలైనా.. ఈ జలసంధి మాత్రం ఇంకా పూర్తిగా తెరుచుకోలేదు. అదీగాక హర్మూజ్‌లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలంటూ ఇరానే స్వయంగా ప్రకటన చేసింది. ఈ పరిస్థితికి సీమైన్స్ కారణం. ఆ జలమార్గంలో వాటిని ఏర్పాటుచేసిన ఆ దేశానికే ఇప్పుడు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియదట..! అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తమపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించగానే ఇరాన్ హర్మూజ్‌ను బ్లాక్ చేయడం మొదలుపెట్టింది. జలసంధిని మూసివేశామని, అందులోకి ప్రవేశించే నౌకలకు నిప్పు పెడతామని హెచ్చరించింది. కొన్ని నౌకలపై దాడులు కూడా జరిగాయి. తన శత్రుదేశాల నౌకలను అడ్డుకునేందుకు.. చిన్న పడవలను ఉపయోగించి సీమైన్స్ పరిచింది. దీంతో రవాణా పూర్తిగా పడిపోయి.. ఇంధన ధరలు భగ్గుమన్నాయి.

ఇప్పుడు ఆ సీమైన్స్ తలనొప్పిగా మారాయి. ఇరాన్ వాటిని చెల్లాచెదురుగా పరిచిందని, వాటిని ఉంచిన స్థానాలను రికార్డు చేసిందో లేదో, తెలియని పరిస్థితి నెలకొందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఒకవేళ రికార్డు చేసినా.. వాటికి ఉన్న పరికరాలు కొట్టుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాకూడా వాటిని ఉంచిన స్థానాలను గుర్తించి, తొలగించడం కష్టతరం అవుతుందని ఆ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. వాటిని తొలగించే సామర్థ్యం కూడా దానివద్ద లేదని తెలుస్తోంది.

సీజ్‌ఫైర్ వేళ.. హర్మూజ్‌ను తెరవాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. దానికి తగ్గట్టుగా ఇరాన్ దానిని తెరవలేకపోతోంది. ప్రత్యామ్నాయ మార్గాలంటూ కొన్ని మ్యాప్‌లను విడుదల చేసింది. సాంకేతికంగా ఉన్న పరిమితులను పరిగణనలోకి తీసుకొని దానిని తెరుస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ (ూఎఝం ూతీఖుస్త్రప్రఎష్ట్రఱ) ఇటీవల వెల్లడించడం కూడా సీమైన్స్ సమస్యను తెలియజేస్తోందని అధికారులు ఆ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇక, హర్మూజ్‌ను ఇరాన్ పూర్తిగా తెరవకపోవడంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ శాంతి చర్చల్లో పురోగతి ఉంటుందో, లేదో తెలియని అనిశ్చితి నెలకొంది. ఇవన్నీ కలిసి యుద్ధం ఏ రూపు దాలుస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

# మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనం

మొదటి పేజి తరువాయి



ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.

బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం: మోదీ హామీ

ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు. తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు

అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# పార్లమెంటు ప్రాంగణంలో అరుదైన దృశ్యం..

ఢిల్లీ: దేశ రాజకీయాల్లో ఉప్పు- నిప్పులా ఉండే ప్రధానమంత్రి మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో ఒకరినొకరు పలకరించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈరోజు మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ లోని 'ప్రేరణ స్థల్' వద్ద ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పూలే విగ్రహానికి నివాళులర్పించగా... అనంతరం ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ పార్లమెంట్ ప్రాంగణానికి చేరుకోగానే సమయానికే రాహుల్ గాంధీ అక్కడకు చేరుకున్నారు. వాహనం దిగి వచ్చిన మోదీకి రాహుల్ మర్యాదపూర్వంగా నమస్కరించారు. అనంతరం ఇద్దరూ కాసేపు పలు విషయాలపై ముచ్చటించుకున్నారు. ప్రధాని ఏదో అడుగుతుండగా రాహుల్ దానికి సమాధానం ఇస్తున్నట్లుగా ఉన్న ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ వాగ్యుద్ధం నడుస్తున్న తరుణంలో, పార్లమెంట్ సాక్షిగా ఇద్దరు అగ్రనేతలు ఇలా సౌహార్దపూర్వక వాతావరణంలో మాట్లాడుకోవడం విశేషం. సభలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నప్పటికీ, దేశం గర్వించదగ్గ మహాత్ముని జయంతి వేడుకల్లో రాజకీయ విభేదాలను పక్కన పెట్టి కలిసి కనిపించడం ప్రశంసనీయం.

# జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

హైదరాబాద్: జగిత్యాలలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కోసం గులాబీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు పార్టీ ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వసంత తదితరులు కలిసి జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని కాలేజీ గ్రౌండ్, మోతే రోడ్డు ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఈ బహిరంగ సభకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడటానికి ప్రధాన కారణం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీలో చేరనుండటమే. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చితే ఈ రెండేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భారీ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును మరోసారి నిరూపించుకోవాలని భావిస్తోంది.

# రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్... ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు. ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక నిషేధిత భూముల జాబితాను (22ూ) అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాల్పుల విరమణ తర్వాత... హర్మూజ్ దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్ జగ్ విక్రమ్

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తాత్కాలికంగా చల్లారడంతో నిలిచిపోయిన నౌకా రవాణా నెమ్మదిగా సాధారణ స్థితికి వస్తోంది. ఇందులో భాగంగా భారత 'జగ్ విక్రమ్' అనే ఎల్పీజీ ట్యాంకర్ కీలకమైన హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఈ మార్గంలో ప్రయాణించిన తొలి భారత నౌక ఇదే కావడం గమనార్హం. షిప్-ట్రాకింగ్ డేటా ప్రకారం... ఈ ట్యాంకర్ ఈరోజు మధ్యాహ్నానికి ఇది ఒమన్ సింధుశాఖలోకి ప్రవేశించి, తూర్పు దిశగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ముంబైకి చెందిన గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యంలోని ఈ నౌక, దాదాపు 20,000 టన్నుల ఎల్పీజీని రవాణా చేస్తున్నట్లు వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు హర్మూజ్ జలసంధి ప్రాంతంలో దాదాపు 28 భారత నౌకలు చిక్కుకుపోయాయి. మార్చి ఆరంభం నుంచి ఇప్పటివరకు 9 నౌకలు పర్షియన్ గల్ఫ్ నుంచి బయటపడగా, మరో 15 భారత నౌకలు ఇంకా సురక్షిత మార్గం కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైంది. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. జగ్ విక్రమ్ ప్రయాణం ఇంధన సరఫరాపై ఆందోళనలను కొంత తగ్గించినప్పటికీ, పలు నౌకలు ఇంకా చిక్కుకొని ఉండటంతో పరిస్థితి పూర్తిగా చక్కబడలేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 'దీదీ'కి మైండ్ బ్లాంక్.. బెంగాల్ బరిలో బీజేపీ బ్రహ్మాస్త్రం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచార హోరును మరింతగా పెంచింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విడుదల చేసిన 'సంకల్ప్ పత్ర' (మేనిఫెస్టో)ను తృణమూల్ కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండికొట్టేలా రూపొందించారు. ముఖ్యంగా మహిళలు, యువతను ఆకర్షించడంతో పాటు, బెంగాలీ సంస్కృతిని కాపాడేలా బీజేపీ చేసిన హామీలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. బీజేపీ మేనిఫెస్టోలోని ఐదు ప్రధాన అంశాలు ఇవే..

చొరబాట్లపై ఉక్కుపాదం

అక్రమ చొరబాట్లను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేసిన బీజేపీ.. చొరబాటుదారులను గుర్తించి, దేశం నుంచి పంపించే (డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్) విధానాన్ని అమలు చేస్తామని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని తీసుకువస్తామని, అలాగే లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు రూపొందిస్తామని హామీ ఇచ్చింది.

మహిళలకు పెద్ద పీట

మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీ నజరానాలు ప్రకటించింది. టీఎంసీ ప్రభుత్వం ఇస్తున్న 'లక్ష్మీర్ భండార్' సాయం కంటే దాదాపు రెట్టింపుగా ప్రతి మహిళకు నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగాలు, పోలీసు శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు, 75 లక్షల మందిని 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది.

యువతకు ఉపాధి

నిరుద్యోగ సమస్యపై ప్రధానంగా ఫోకస్ పెట్టిన కమలనాథులు.. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 భృతి ఇస్తామని ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో కోటి కొత్త ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 5 లక్షల మంది యువతకు చెరో రూ.10 లక్షల ఆర్థిక సాయం (సగం గ్రాంట్, సగం వడ్డీ లేని రుణం) అందించనున్నామని తెలిపారు.

తమను బయటి వ్యక్తులుగా ముద్రవేస్తున్న టీఎంసీ వాదనను తిప్పికొడుతూ.. బెంగాలీ ఆత్మగౌరవాన్ని కాపాడతామని బీజేపీ స్పష్టం చేసింది. ఇందులో భాగంగా వందేమాతరం మ్యూజియం, ఠాగూర్ కల్చరల్ సెంటర్ల ఏర్పాటుతో పాటు అన్ని శక్తిపీఠాలను కలుపుతూ ప్రత్యేక సర్క్యూట్ అభివృద్ధి చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ.. తాజ్‌పూర్, కుల్పిలో ఆధునిక డీప్-సీ పోర్టులను నిర్మిస్తామని బీజేపీ తెలిపింది. సుందర్‌బన్స్ నుండి డార్జిలింగ్ వరకు నేరుగా జాతీయ రహదారితో పాటు, ఉత్తర బెంగాల్‌లో నాలుగు కొత్త నగరాల నిర్మాణాన్ని తమ 'సంకల్ప్ పత్ర'లో ప్రముఖంగా పొందుపరిచింది.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## 'రాష్ట్రంలో పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

**- టిడిపి జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి**

**రాజానగరం నియోజకవర్గంలో రూ. 19.36 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.); ఆపదలో ఉండి వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని, బాధితులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు మరియు రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు.బూరుగుపూడి గేట్ వద్ద గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ మరియు పార్టీ క్యాడర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 19,36,985/- విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు.ముక్కినాడకు చెందిన వీర్రాజు వీర వెంకట సత్యనారాయణకు రూ. 1,24,076/-కలవచర్లకు చెందిన కొయ్య సత్యవతికి రూ. 1,46,944/-రాపాకకు చెందిన చుండ్రు రామ తులసికి రూ. 77,806/-పల్లకాడియానికి చెందిన రేగులబంధ వరలక్ష్మికి రూ. 72,656/-ములకలంకకు చెందిన మల్లంపూడి అనంత లక్ష్మికి రూ. 70,918/-పుణ్యక్షేత్రానికి చెందిన మాదిరెడ్డి చక్రరావుకు రూ. 69,397/-ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారు పార్టీ కార్యాలయంలో సంప్రదిస్తే, వారికి ప్రభుత్వం నుండి తగిన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి చంటిబాబు, అడపా వీరబాబు, దూది కాంతారావు, మార్ని రాము, కందుల బాబు రాయుడు, దిడ్డి మాధవరావు, గోల్కొండ సత్యనారాయణ, మాతా ప్రభు, సొడసాని త్రిమూర్తులు,తదితరులు పాల్గొన్నారు.

## నన్నయ్య వర్సిటీ స్నాతకోత్సవానికి విచ్చేసిన గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని ప్రతిష్టాత్మక శ్రీ ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ 16 మరియు 17వ ఉమ్మడి స్నాతకోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం స్థానిక అధికారులు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రసన్నశ్రీ మరియు ఇతర ముఖ్య నేతలు గవర్నర్‌కు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ, మన ప్రాంతంలోని ఉన్నత విద్యా సంస్థ అయిన నన్నయ్య యూనివర్సిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ రావడం ఈ ప్రాంత విద్యార్థులకు, విద్యావేత్తలకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హెలిప్యాడ్ నుండి గవర్నర్ నేరుగా యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, యూనివర్సిటీ సెనేట్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ..**



అమరావతి ఏప్రిల్ 12 నేటి శుభోదయ :దళిత, గిరిజన, బలిహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ద్వారా 'రాజ్యాధికార సాధనకి' కృషి చెయ్యాలని మహాత్మ జ్యోతిరావు పూలే సూచించారని. ఆ సూచనను యుగంలో పూలే తనకు గురువని అంబేద్కర్ ప్రకటించారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో శనివారం జ్యోతిరావు పూలే 199 వ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతజాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయన అన్నారు 1827 ఏప్రిల్ 11 న మహారాష్ట్రలోని పూణేలో పుట్టారని. బాల్యంలోనే తల్లిని కోల్పోయారని జ్యోతిరావు పూలే. మాలి కులంలో పుట్టిన పూలే చిన్ననాటి నుంచి ఆధిపత్య కులాల అహంకారానికి గురయ్యారని ఆయన తెలిపారు. పీష్వాల పాలనా కాలమది. కింది కులాల పిల్లలు పశువులు, గొర్రెలు మేపటానికే పరిమితమయ్యేవారని మట్టి పనులు చేసేవారని. పూలే పూర్వీకులు పీష్వాలకు పూలు, పూలదండలు తీసుకు వెళ్లేవారని. పూలదండలు అల్లేవారు కాబట్టే వారి కులానికి 'మాలి' అనే పేరు వచ్చిందిని ఆయన అన్నారు . పూలకు చదువంటే ఇష్టం. ఏడేళ్ల వయసులో మరాఠా పాఠశాలలో చేరారని ఇది సహించలేని కొన్ని కులాల వారు పూలే కుటుంబంపై దాడి చేశారని. శూద్రులు చదువుకుంటే కరువు కాటకాలు వస్తాయని, ధర్మం నశించిపోతుందని వాపోయారని. వారి ఆగ్రహానికి గురికావలసి వస్తుందని భయపడిన పూలే తండ్రి చదువుని మధ్యలో మాన్పించారని ఆయన తెలిపారు. అవి బాల్యవివాహపు రోజులు. 13 సంవత్సరాల వయసులో పూలే సావిత్రిబాయిని వివాహం చేసుకున్నారని. వివాహానంతరం పూలే తన చదువును కొనసాగించారని. ఆ రోజుల్లో ఒక ఆధిపత్య కుల వివాహ కార్యక్రమానికి పూలే వెళ్లారని. ఈ విషయం కలకలం రేపింది. పూలే రాకతో తమ కులం అపవిత్రమయ్యిందని గగ్గోలు పెట్టారని ఆయన తెలిపారు పూణేలో పాఠశాల నుంచి భార్య సావిత్రిబాయిని టీచర్ గా నియమించాలని మహిళలకు చదువు నేర్పే చైతన్యం తీసుకువచ్చేందుకు జ్యోతిరావు పూలే కుటుంబం పట్ల కొన్ని కులాల ఆంక్షలు విధించారని ఆయన తెలిపారు

## భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, దర్శనం కోసం వేచి ఉండే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లలో మంచినీరు, చలువ పందిళ్లు మరియు ఇతర కనీస వసతులను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి, సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు గాను, ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసారు. ఈ సమయంలో కేవలం ముఖమండప దర్శనం ద్వారానే భక్తులను అనుమతించారు. భక్తులు ఈ మార్పును గమనించి, ఆలయ సిబ్బందికి సహకరించి ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవాలని దేవస్థానం సంబంధిత అధికారులు కోరారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారికి బంగారు లక్ష్మీ హారం అందజేత



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- హైదరాబాద్ కు చెందిన కె. శ్రీనివాసు మూర్తి కుటుంబం 33 గ్రాములు బరువు గల, సుమారు 5 లక్షల విలువైన హారాన్ని ఆలయ అధికారులను కలిసి విరాళంగా అందజేసారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## నగరంలో డిసిల్టింగ్ పనులను వేగంగా చేయండి

**విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- నగరంలో డీజిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా పంట కాలువ రోడ్డు, హెచ్ టి లైన్ రోడ్డు, పటమట ప్రాంతం పర్యటించి క్షేత్రస్థాయిలో డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలని అవసరమైతే అదనపు వాహనాలు ఉపయోగించి డీసిల్టింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. నగరంలోని ప్రతి చిన్న డ్రైన్ నుండి మేజర్ ఔటఫాల్ డ్రైన్ లో ఎటువంటి వ్యర్థాలు లేకుండా నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 15 నుండి సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) లో అందరూ పాల్గొనండి

**: విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- ఈ నెల15 నుండి సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) లో అందరూ పాల్గొనాలని విజయవాడ నగర ప్రజలకు పిలుపునిచ్చారు కమిషనర్ ధ్యానచంద్ర. శనివారం ఉదయం కోనేరు బసవయ్య బాయ్స్ హై స్కూల్ పటమట లో జరుగుతున్న జన గణన ఎన్యుమరేటర్స్ శిక్షణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జన గణన ప్రక్రియ మొదలయ్యే నేపథ్యంలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మూడు సర్కిళ్ల పరిధిలో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో అందిస్తున్నామని ప్రజలు కూడా ఈ జనగణ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేందుకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా వారి వివరాలన్నీ వారి స్వయంగా జనాభా లెక్కల్లో నమోదు చేయొచ్చని తెలిపారు. ఎన్యుమరేటర్లు వారి వద్దకు వచ్చినప్పుడు వారికి సహకరించి వారి వివరాలన్నీ ఎన్యుమరేటర్లకు తెలుపవలసిందిగా విన్నవించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఈ నెల 15, నుండి మొదలై ఈ నెల 30, వరకు ఉంటుందని, కావున నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మే నెల 1, నుండి ఎన్యూమేరేటర్లు ప్రజల వద్దకు వెళ్లి వారు స్వీయ గణన ద్వారా పొందుపరిచిన వివరాలను వెరిఫై చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కే షమ్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యోతిబాపూలే కి ఘన నివాళులు



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- జ్యోతిబాపూలే కి ఘన నివాళులర్పించారు విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఏ రవీంద్రరావు. శనివారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బందితో ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ ఏ.రవీంద్రరావు మాట్లాడుతూ, జ్యోతిరావ్ పూలే గారి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు ఆయన చేసిన కృషి అమూల్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, మహిళా సాధికారత, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన ఉద్యమాలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు. అలాగే, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మరియు పౌరుడు పూలే గారి ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. సమానత్వం, సహనం, మరియు సేవాభావం వంటి విలువలను మన జీవన విధానంలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## పూలే ఆశయ సాధనకు టిడిపి కృషి

**: ఎంపి కేశినేని శివనాథ్**



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- మూఢనమ్మకాలు, వివక్షపై పోరాడి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ ఆనాడు ఎవరికీ అవగాహన లేని సమయంలోనే మహిళలు, బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తిన తొలి మహాత్ముడు పూలే అని కొనియాడారు . నందమూరి తారకరామారావు బీసీ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పూలే ఆశయాలకు అనుగుణంగానే తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూడా తెలుగుదేశం పార్టీ పూలే , ఎన్టీఆర్ స్ఫూర్తితో పేద, బడుగు వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. బీసీలకు కేవలం సంక్షేమం మాత్రమే కాకుండా, రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించి చట్టసభల్లో గౌరవించిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనని స్పష్టం చేశారు . ప్రస్తుతం కీలక పదవుల్లో ఉన్న బీసీ నేతలే ఇందుకు నిదర్శనం అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న పల్లా శ్రీనివాసరావు వంటి వారు బీసీ నాయకులేనని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో బీసీలకు అత్యధికంగా మంత్రి పదవులు ఇచ్చి గౌరవించిన ఘనత కూడా పూలే ఆశయాలతో స్థాపించిన తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని అన్నారు. పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం, మాజీ కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి , కొట్టేటి హనుమంతరావు, కాకు మల్లిఖార్జున యాదవ్, బీసీ నాయకులు,టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్, టీ ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.దర్శిత్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సొంగా సంజయ్ వర్మ, శాప్ డైరెక్టర్ ఎస్. సంతోష్, టిడిపి సీనియర్ నాయకులు కామా దేవరాజ్, చిట్టాబత్తుని శ్రీనివాసరావు, నరసింహ చౌదరి, డాక్టర్ సంకే విశ్వనాథం, సోలంకి రాజు, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శం

**: గద్దె అనురాధ**



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- విజయవాడ ఆటోనగర్ లోని తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయం లో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి పురస్కరించుకొని పూలే విగ్రహానికి టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు పూలమాల వేసి ఘనంగా నివాళులులర్పించారు.ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూలి జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని, కుల వివక్షను రూపుమాపడానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.సమాజంలో మార్పు రావాలంటే విద్యే ప్రధాన ఆయుధమని పూలే నమ్మేవారని, ముఖ్యంగా మహిళలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్న మాటలను గుర్తుచేశారు.పూలే తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించి, ఆమెను దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని, వారిద్దరూ తమ జీవితాలను సమాజ సేవకే అంకితం చేశారని పేర్కొన్నారు.వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు: గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అణగారిన వర్గాలపై దాడులు పెరిగాయని, దాదాపు 300 మంది వరకు చనిపోయారని ఆరోపించారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్ పట్ల జరిగిన దుశ్చర్యను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. సమాజంలో కుల వివక్ష ఉండకూడదని, అందరూ సమానమని ఆయన నమ్మిన సిద్ధాంతాలను వివరించారు. పూలే ఆలోచనల స్ఫూర్తితోనే ఎన్టీ రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, 'డ్వాక్రా' గ్రూపులు వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సింహాద్రి కనకాచారి, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మహమ్మద్ జైనుల్ అబిదిన్(అఫ్సర్), హయత్ ఖాన్, పామర్తి కిషోర్ బాబు, బత్తుల దుర్గారావు, కోనేరు రాజేష్, ఉప్పిడి రాము, దేవరపల్లి ఆంజనేయులు, మల్లెల రామకృష్ణ, బోయిన సుబ్రహ్మణ్యం, దోమకొండ రవికుమార్, దాసరి గాబ్రియల్, వాకా వెంకటేశ్వరావు గౌడ్, గొల్లపూడి నాగేశ్వరరావు,జాస్తి సురేష్, గుమ్మడి వెంకటేశ్వరరావు, తాడి బాబురావు, కొడాలి సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- మైలవరం ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆసుపత్రిలో సంతృప్తికరంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు రోగులు తెలిపారు. సర్జికల్ వార్డును, జనరల్ వార్డును, ప్రసూతి వార్డును పరిశీలించారు. తొలుత ఆసుపత్రి రిజిస్టర్లను పరిశీలించి సిబ్బంది అందరూ హాజరయ్యారో లేదో విచారించారు. ఓ ఇద్దరు వైద్య సిబ్బంది ఆసుపత్రి సూపరిండెంట్ అనుమతితో బయటికి వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంట్, వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సమావేశం అయ్యారు. వైద్యసేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేయడంతో వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. వైద్యో నారాయణో హరి అన్నారని, రోగుల ప్రాణాలు రక్షిస్తున్న వైద్యులు అందిస్తున్న సేవ దేశ సేవతో సమానం అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువగా పేదలు వస్తుంటారని వారికి ఇక్కడ అంకిత భావంతో సేవలు అందిస్తున్న వైద్యులను అభినందించారు. ఆసుపత్రిలో ఇటీవల జనరేటర్ సౌకర్యం కల్పించారని, ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కి ప్రతిపాదనలు పంపి, ఓటి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రిలో సాధారణ అవసరాలు గుర్తించి, ఇతరత్రా ఏర్పాట్లను దాతలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## రాఘవాపురంలో నూతన శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

**- ఆలయంలో ప్రత్యేక పూజలు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం రాఘవపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు,గ్రామస్తులు, భక్తులు, ఎమ్మెల్యే బలరామకృష్ణకు ఘన స్వాగతం పలికారు. వేదపండితులు ప్రధాన అర్చకులు సారథ్యంలో వివిధ ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే బలరామకృష్ణ శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి విగ్రహాలకు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో ఎన్డీయే కూటమి నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## కోరుకొండ శ్రీ కోదండ రామాలయం వద్ద ఘనంగా అన్నసమారాధ కార్యక్రమం

**- అన్నదాన కార్యక్రమానికి సుమారు వెయ్యి కిలోల బియ్యం, 40 వేల రూపాయల కిరణా పట్టి విరాళం..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండల కేంద్రంలోని ప్రసిద్ధ అంకాలమ్మ గుడి వద్ద వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ 'రామసేన' అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో సేవా దృక్పథం పెరగాలని, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఆలయాల అభివృద్ధి మరియు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల భక్తిభావం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. సుమారు 2000 మందికి అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి వినియోగించిన సుమారు వెయ్యి కిలోల బియ్యం, 40 వేల రూపాయల కిరణా పట్టి మొత్తాన్ని 'రామసేన' అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, రామసేన సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.



## ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన దక్షిణాది న్యాయవాదుల క్రికెట్ టోర్నీ విజేత ఏపీ జట్టు



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- బెంగళూరు వేదికగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన 7వ సౌత్ ఇండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల జట్టు ఘన విజయం సాధించింది. ఫైనల్ పోరులో తమిళనాడు జట్టుపై ఏపీ జట్టు విజయకేతనం ఎగురవేసి, ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ టీమ్ సభ్యులు శనివారం ఎంపీ కేశినేని శివనాథ్ ని గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గెలిచిన ట్రోఫీని ఎంపీ చిన్నికి చూపించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని క్రీడాకారులైన న్యాయవాదులను ప్రత్యేకంగా అభినందించారు . భవిష్యత్తులో అడ్వకేట్ క్రికెట్ జట్టుకు, న్యాయవాదులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఏపీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడు చలసాని అజయ్ కుమార్ , నాయకులు యెర్నేని వేదవ్యాస్ , కోచ్ సునీల్ , కెప్టెన్ క్రాంతికుమార్ , వైస్ కెప్టెన్ సాజిద్ ముజిబ్, సభ్యులు ఉన్నం సాయి కరణ్ , ఎస్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు .

## పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

### రూ.1.04 కోట్లతో రెడ్డిగూడెంలో సీసీ రోడ్లు పారంభం



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ పట్టిందని, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడం హర్షించదగిన విషయం అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. రెడ్డిగూడెంలో రూ.1.04 కోట్ల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధుల సౌలభ్యత, సమస్యల తీవ్రతను బట్టి అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలోనే పల్లెపండుగ 1, 2 కార్యక్రమాల్లో మన మైలవరం నియోజకవర్గంకు కేటాయించిన నిధులను సంపూర్ణంగా సద్వినియోగం చేశాం. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి నిర్దేశించిన వాటి కంటే ఎక్కువ నిధులు తెచ్చానని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలకు మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే

### ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- భావితరాలకు మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే చూపిన వెలుగుబాటలో మనమంతా పయనిద్దామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. కొండపల్లిలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, అక్కల రామ మోహన్ రావు (గాంధీ)పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి, పక్కనే ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ "మన దేశంలో ఉద్భవించిన సంఘ సంస్కర్తలందరిలో అగ్రగణ్యుడు, వెలుగుబాట చూపిన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ద్విశతాబ్ది ఉత్సవాలు నేడు ప్రారంభమవుతుండటం విశేషం.మహానుభావులను మనమంతా గుర్తించి, గౌరవించాలి. వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి. ఆనాడు పూలే లాంటి ఎందరో మహానుభావుల పోరాటాల కారణంగానే నేడు మనం సమాన హక్కులు పొంది స్వేచ్ఛగా జీవిస్తున్నాం. పూలే ఆశయాలకు అనుగుణంగా ఏపీలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో అట్టడుగు, పేద వర్గాల ప్రజలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే నైతిక స్థైర్యానికి, నిరంతర శోధనకు ప్రతీకగా నిలిచారు. ఆయన సమాజ శ్రేయస్సు పట్ల అచంచల నిబద్ధతతో జీవనం సాగించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన పూలే జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ విజ్ఞాన సముపార్జన తృష్ణకు, ధైర్యానికి, సామాజిక నిబద్ధతకు ఆటంకం కలిగించలేదు. పాఠశాల స్థాయి నుంచే జ్యోతిరావు పూలే లో లోతైన జ్ఞాన తృష్ణ ఉండేది. "మనలో ఎన్ని ప్రశ్నలు ఉదయిస్తే అంత పరిజ్ఞానం చేకూరుతుంది." అని ఆయన తదనంతర జీవితంలో చేసిన వ్యాఖ్య అక్షర సత్యం. బాల్యం నుంచే పూలే లో చిగురించిన వైజ్ఞానిక జిజ్ఞాస జీవన పర్యంతం ఆ మహనీయుని వెంట నిలిచింది.సమాజంలో అందరికీ సమాన హక్కులు దక్కే వరకూ నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించదు అని మహాత్మా జ్యోతిరావు పూలే దృఢంగా విశ్వసించారు. ఈ ఆలోచనను ఆచరణలోకి తేగల వ్యవస్థలను నిర్మించి సామాజిక న్యాయానికి దోహదపడ్డారు. ఆయన స్థాపించిన ' 'సత్యశోధక్ సమాజ్' ఆధునిక భారతంలో ఉద్భవించిన అతిముఖ్యమైన సంఘ సంస్కరణోద్యమం. ధైర్యంగా ఎలా బతకాలో పూలే గారి వ్యక్తిగత జీవితం మనకు నేర్పే పాఠం. ప్రతిఒక్కరూ మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయాల సాధనకు కృషిచేయాలి." అని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### -గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము -వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ విజేత....'అమ్మ క్యాటరర్స్' -ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ పోటీలు.



గుడివాడ, ఏప్రిల్ 11( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విద్యార్థులు,యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో జరుగుతున్న వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ పోటీల్లో సుబ్బు లెవెన్స్ జట్టుపై అమ్మ క్యాటరర్స్ టీం 4 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన అమ్మ క్యాటరర్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 70 పరుగులు చేయగా సుబ్బు లెవెల్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 66 పరుగులు చేసింది.హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోటీలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము,కూటమి నాయకులు,పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు.విజేతలకు ఎమ్మెల్యే రాము బహుమతులతో పాటుగా మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు 50వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు 25వేల చెక్కులను అందించారు.టోర్నమెంట్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన అమ్మ క్యాటరర్స్ జట్టు సభ్యుడు మద్దెల శ్రీనుకు బెస్ట్ బ్యాట్స్ మెన్,సుబ్బు లెవెన్స్ ప్లేయర్ విమల్ నాయక్ కు బెస్ట్ బౌలర్ అవార్డులు, నగదు బహుమతులు అందించారు.ఈ సందర్భంగా తొలుత జరిగిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే జీవితంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని తెలిపారు.యువతరం క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వడం వలన, శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు భావన, కలుగుతుందన్నారు.గుడివాడలో టోర్నీ చాలా అద్భుతంగా నిర్వహించారని నిర్వాహకులను ఎమ్మెల్యే రాము అభినందించారు. ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిందని, ఐపీఎల్ మ్యాచ్ చూసిన అనుభూతి వచ్చిందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా గుడివాడలో ప్రీమియర్ లీగ్ పోటీలు జరిగేలా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్ఫూర్తితో వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు కటికల కళ్యాణ్, సమ్మెట వరుణ్ తెలిపారు. 82 జట్లు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. పోటీల విజయవంతానికి సహకరించిన స్పాన్సరర్స్, క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్టేడియం కమిటీ పెద్దలకు నిర్వాహకులు కళ్యాణ్, వరుణ్ ధన్యవాదాలు తెలిపారు.విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టిడిపి నాయకులు గోకవరపు సునీల్, గోర్జి సత్యనారాయణ, నిమ్మగడ్డ సత్యసాయి, పంద్రాజు సాంబయ్య, కొడాలి రామరాజు, కడియాల గణేష్, వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్స్ కటికల కళ్యాణ్, సమ్మెట వరుణ్, సుధీర్ పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతిజీ వేడుకలు



గుడివాడ, ఏప్రిల్ 11 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన నాయకులు కొడమల గంగాధర్, పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు, పట్టణ ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల గడియార స్తంభం వద్ద హెల్మెట్ పై అవగాహన కల్పించిన ఎస్సై విజయ్ కుమార్



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 11 :బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు గారి ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ సీఐ రాంబాబు గారి ఆధ్వర్యంలో బాపట్ల పట్టణ ఎస్సైలు ఎస్సై విజయ్ కుమార్ ఉమెన్ ఎస్సై నస్రీన్ వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా వాహనదారులు లైసెన్స్, బండి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలు ను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు అవగాహన కల్పించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచనలు చేశారు. ఈ నెల 15వ తారీకు నుంచి "నో హెల్మెట్ -నో ప్యూయల్ "అనే కార్యక్రమం జరుగుతుందని వాహనదారులకు వివరించారు. ఏప్రిల్ నెల 15వ తారీకు నుంచి హెల్మెట్ లేని వాహనదారులకు పెట్రోల్ బంకు నందు బండిలో పెట్రోల్ నింపరు అని విజయ ఎస్ఐ తెలిపారు. ప్రతి వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదు నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజు నిర్వహించే ఈ తనిఖీలు వాహనదారులను ఇబ్బంది పెట్టటం కోసం కాదని ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించి ప్రజలకు ప్రాణాలను కాపాడటమే తమ లక్ష్యం అని ఎస్సై విజయ్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎస్సై విజయ్ కుమార్ ఉమెన్స్ ఎస్సై నస్రీన్ ట్రాఫిక్ సిబ్బంది ప్రసాద్ వారి బృందం పాల్గొన్నారు.

## బాపట్ల ఎంపీ కార్యాలయంలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 11 :భారతదేశ సామాజిక విప్లవ పితామహుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా లోక్ సభ ప్యానల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ అమరావతి లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఎంపీ గారి పిలుపు మేరకు బాపట్ల ఎంపీ కార్యాలయంలో ఆయన అనుచరులు, అభిమానులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొని పూలేకు ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పటాన్ రాజేష్, భోగిరి రామారావు, నర్రా ఏడుకొండలు, పాపయ్య, గవిని దుర్గ ప్రసాద్, బడుగు పృధ్వీ రాజ్ పాల్గొన్నారు.

## పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న పల్నాటి శ్రీరాములు



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 11:మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి ని పురస్కరించుకుని శనివారం బాపట్ల మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద గల మహాత్మా పూలే,మాతా సావిత్రి బాయి పూలే విగ్రహాలకు బహుజన నాయకులు గడ్డం ఏలియా, బహుజన కెరటాలు వ్యవస్థాపకుడు పల్నాటి శ్రీరాములు పూల మాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ దేశంలో సామాజిక ప్రజాస్వామ్యం కోసం, మహిళా విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయులు మహాత్మా పూలే దంపతులని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కట్టా కొర్నేలియా, సురేష్ ,జ్యోతి, రామకృష్ణ,ఆరీఫ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఎస్టీ కాలనీ చందోలు గ్రామంలో నిర్వహించారు

### బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు బాపట్ల సర్కిల్ సిఐ హరికృష్ణ ఆధ్వర్యంలో చందోలు ఎస్ఐ మర్రి వెంకట శివ కుమార్ పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఎస్టీ కాలనీ చందోలు గ్రామంలో నిర్వహించారు



బాపట్ల నేటి శుభోదయ ఏప్రిల్ 11:ఈ కార్యక్రమంలో ఎస్సై మర్రి వెంకట శివకుమార్ మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితాలు మారుతాయని, ప్రతి తల్లితండ్రులు తమ పిల్లలను చదివించి సమాజంలో మంచి స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. విద్యతోనే మన జీవితాలు, మన సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.అలాగే, ఫోక్సో కేసులు (బాలలపై జరిగే దౌర్జన్యాలు) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు పనికి వెళ్లే సమయంలో చిన్న పిల్లల్ని పెద్దవారికి అప్పగించాలని సూచించారు. సైబర్ మోసాలు పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి వ్యక్తులకి ఓటీపీలు ,బ్యాంకు వివరాలు, ఆధార్ నెంబర్లు తెలియజేయరాదని హెచ్చరించారు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 నెంబర్ కి కాల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని, అలాగే శక్తి యాప్ ద్వారా మహిళల అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందవచ్చని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించే లేదా అమ్మే వ్యక్తుల గురించి 1972 నెంబర్ కి సమాచారం ఇవ్వమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ కుమారుల కోడలు లేదా కుటుంబ సభ్యులుచే వేధింపులకు గురైనప్పుడు వెంటనే పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందోలు ఎస్సై మర్రి వెంకట శివకుమార్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన చందోలు ఎస్సై మర్రి వెంకట శివకుమార్



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 11: బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు గారి ఆదేశాలు మేరకు బాపట్ల సర్కిల్ సిఐ హరికృష్ణ గారి ఆధ్వర్యంలో చందోలు గ్రామం నందు పొన్నూరు వెళ్లే రహదారిలో వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా, వాహనదారుల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు అవగాహన కల్పించడంతోపాటు, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మర్రి వెంకట శివ కుమార్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని ఆయన కోరారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాణాలకు రక్షణ కల్పిస్తాయని గుర్తుచేశారు. ప్రతి వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ నిర్వహించే ఈ తనిఖీలు వాహనదారులను ఇబ్బంది పెట్టడం కోసం కాదని, ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించి ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ లక్ష్యమ ని చందోలు ఎస్సై మర్రి వెంకట శివకుమార్ స్పష్టం చేశారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తులను అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



విజయవాడ, ఏప్రిల్ 11 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న "ధర్మపథం - సాంస్కృతిక కార్యక్రమము"లో భాగంగా, శనివారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా ముగిసింది.హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ నృత్య సంస్థ "ఈశ్వర్ కూచిపూడి కళాక్షేత్ర" కళాకారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ప్రముఖ నృత్య కళాకారిణి శ్రీమతి పి. రాజేశ్వరి పర్యవేక్షణలో జరిగిన ఈ సాంస్కృతిక కార్యక్రమం ఆద్యంతం భక్తిపూర్వకంగా సాగింది.కళాకారులు ప్రదర్శించిన పలు ఆధ్యాత్మిక నృత్య అంశాలు వీక్షకులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తాయి. ముఖ్యంగా ఏకదంతాయ గురు బ్రహ్మ గురు విష్ణు గురుదేవో శివ తాండవం శివోహం ఓం నమో నారసింహ కళాకారుల హావభావాలు, లయబద్ధమైన నాట్య విన్యాసాలు చూపరుల మన్ననలు పొందాయి. దుర్గమ్మ దర్శనార్థం విచ్చేసిన భక్తులు, నగరవాసులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నృత్య ప్రదర్శనను వీక్షించి, అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ) కళా బృందాన్ని అభినందించారు.

## రామన్నపూడిలో మట్టి మాఫియా బరితెగింప

### గ్రామస్తులపై దాడిని ఖండించిన -వైఎస్ఆర్ సీపీ నాయకులు



గుడివాడ రూరల్, ఏప్రిల్ 11( అజయ్ నారగాని - నేటి శుభోదయ) మండల పరిధిలోని రామనపూడి గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ వైఎస్ఆర్సిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించిన నాయకులు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు జరపడమే కాకుండా,వాటిని ప్రశ్నించిన స్థానికులపై దాడులకు పాల్పడటం దుర్మార్గమని వైఎస్ఆర్సిపి నాయకులు మండిపడ్డారు.గ్రామస్థులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.సామాన్య ప్రజలపై దాడులు జరుగుతుంటే శాంతిభద్రతలు ఎక్కడున్నాయని నిలదీశారు.బాధితులకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్సిపి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మట్ట జాన్ విక్టర్,మెండ కిరణ్,గంట సురేష్,గంటా శీను, కందవల్లి రవి,మసిముక్కు ఈశ్వర్ కుమార్,బోయిన సోమ శేఖర్,తోట వీరరామయ్య,మేడిపల్లి ఏసోబు,సాయినా నాగ బాబు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి!ప్రాణాలు కాపాడుకోండి

### సి. ఐ. గోపాలకృష్ణ



చింతూరు డివిజన్ నేటి శుభోదయ: హెల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని ద్విచక్ర వాహనదారులకు, ఇతరులకు చింతూరు సి ఐ గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే సాధ్యమైనంత ఎక్కువ శాతం హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని పేర్కొన్నారు.ఈ మేరకు శనివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేనిదే డ్రైవింగ్ చేయరాదని అలా చేయటం నేరమని పేర్కొన్నారు. హెల్మెట్ ధరిస్తే 90 శాతం మరణాలు సంభవించకుండా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సీఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, హెల్మెట్ లేని వారికి సుమారు 20 మందికి కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వాహనదారులలో తేవడానికి తాము ఈ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు తమ వద్దకు వస్తే డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడానికి సహాయపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ తోపాటు, ఎస్సై సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## తాటి చెట్టు నుండి జారి పడి వ్యక్తి మృతి



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:పోలవరం జిల్లా చింతూరు మండలం మదుగూరు గ్రామం కి చెందిన మోటు జోగయ్య ( 61) తాటి కల్లు తీసేందుకు శుక్రవారం రాత్రి తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి క్రింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికి సంఘటన స్థలంలో మృతి చెంది ఉన్నట్టు చింతూరు ఎస్ ఐ సంతోష్ తెలిపారు. కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ వెల్లడించారు.

## ఈవీ రంగానికి పెట్టుబడుల వరద..

## వచ్చే ఐదేళ్లలో 3.4 లక్షల కోట్లు వచ్చే అవకాశం



కొలియర్స్ ఇండియా అనే కన్సల్టింగ్ సేవల సంస్థ ఇటీవల ఓ నివేదికను వెల్లడించింది. దేశంలో ఈవీ పరిశ్రమ ప్రగతిని వివరించింది. ఆ రంగంలో పెట్టుబడులు పెరిగే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. దాని ప్రకారం వచ్చే ఆరేళ్ల అంటే 2030 నాటికి దేశంలోని ఈవీ, అనుబంధ పరిశ్రమలలో రూ.3.4 లక్షల పెట్టుబడులు రానున్నాయి. ఈ రంగంలో స్థిరమైన ప్రగతి కనిపిస్తోంది. అయినప్పటికీ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు నెమ్మదిగానే ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 8 శాతం రేటుతో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈవీల విక్రయాలు పెరగడానికి మెరుగైన తయారీతో పాటు చార్జింగ్ సదుపాయాల కల్పించాలి. ధరలలో అంతరాలను తగ్గించాలి. దేశంలో 2030 నాటికి అమ్ముడయ్యే వాహనాలలో 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దానికి ప్రకారం దాదాపు 8 కోట్ల ఈవీలు అమ్ముడుకావాలి. ప్రస్తుతానికి ఈ వాటా కేవలం 8 శాతం మాత్రమే ఉంది. ఇప్పటి వరకూ విక్రయించిన ఈవీలను 50 లక్షలు



దాటలేదు. ఈ ఏడాది మాత్రం 20 లక్షలు అమ్ముడవుతాయని అంచనా. ఈ ప్రకారం ప్రభుత్వం తన లక్ష్యాన్ని చేరుకోవడానికి రానున్న ఆరేళ్లలో ఏడాదికి సగటున ఆరు రెట్లు సేల్స్ పెరగాల్సి ఉంది. అయితే ఇది కొంచెం కష్టమైన విషయమే. ఈవీ రంగంలో రాబోయే ఐదు నుంచి ఆరేళ్లలో ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు పెట్టనున్నారు. ఇవి రియల్ ఎస్టేట్ అవకాశాలను, పారిశ్రామిక, గిడ్డంగుల రంగానికి ప్రోత్సాహం అందించనుంది. భూసేకరణను వేగవంతం చేయడం, లిథియం- అయాన్ బ్యాటరీలతో సహా ఈవీ మరియు ఓఈ తయారీ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేసే అవకాశం ఉంది. సబ్సిడీలు, పన్ను రాయితీలు, దేశీయంగా ఉత్పాదన, చార్జింగ్ మౌలిక సదుపాయాలు వంటి విషయాలను ఈవీల విక్రయాలకు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వీటి ద్వారానే 2030 నాటి లక్ష్యాలన్ని చేరుకోగలిగే అవకాశం లభిస్తుంది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. నిత్యం అనేక కంపెనీల వాహనాల విడుదలవుతున్నాయి. అతి పెద్ద జనాభా ఉన్న మన దేశంలో అనుకున్న స్థాయిలో వీటి విక్రయాలు జరగడం లేదు. ముఖ్యంగా చార్జింగ్ స్టేషన్లు సరిపడినన్ని లేకపోవడమే దీనికి ప్రధానం కారణం. అలాగే మామూలు వాహనాలతో పోల్చితే వీటి ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. అక్కడక్కడా ఈవీల నుంచి పొగలు, మంటలు రేగుతున్నట్టు వస్తున్న వార్తలు కూడా వీటి కొనుగోలు వేగంగా పెరగకపోవడానికి కారణమవుతున్నాయి.

# శతక్కొట్టిన సంజూ.. బోణీ కొట్టిన సీఎస్‌కే

ఐపీఎల్-2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. శనివారం చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 23 పరుగుల తేడాతో సీఎస్‌కే విజయం సాధించింది. 213 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్(60) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఫాథుమ్ నిస్సాంక(41), అశుతోష్ శర్మ(19) రాణించారు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. సీఎస్‌కే బౌలర్లలో జేమీ ఓవర్టన్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. కాంబోజ్ మూడు, నూర్ అహ్మద్, ఖలీల్ తలా వికెట్ సాధించారు.



సంజూ సూపర్ సెంచరీ

అంతకుముందు బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. చెన్నై ఓపెనర్ సంజూ శాంసన్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. సంజూ కేవలం 52 బంతుల్లోనే తన నాలుగో ఐపీఎల్ సెంచరీ మార్కును అందుకున్నాడు. మొత్తంగా సంజూ 56 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్స్‌లతో 115 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు ఆయూశ్ మాత్రే(59) హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక్కడే ఓ వికెట్ సాధించాడు.

చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ సంజూ శాంసన్ అద్భుత సెంచరీతో మెరిశాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సంజూ విధ్వంసక సెంచరీతో కదం తొక్కాడు. కేవలం 56 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 115 పరుగులు సాధించి చెన్నై భారీ స్కోరుకు బాటలు వేశాడు. అతని అద్భుత ఇన్నింగ్స్‌కు తోడు ఆయుష్ మాత్రే అర్ధశతకంతో రాణించడంతో, చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. కాగా, ఐపీఎల్ లో సంజూ శాంసన్ కు ఇది నాలుగో సెంచరీ. ఈ సీజన్ లో మొదటిది.



ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం సరైంది కాదని చెన్నై బ్యాటర్లు నిరూపించారు. ఇన్నింగ్స్ ఆరంభంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (18 బంతుల్లో 15) నెమ్మదిగా ఆడి 62 పరుగుల వద్ద తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన యువ ఆటగాడు ఆయుష్ మాత్రేతో కలిసి సంజూ శాంసన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ ఢిల్లీ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా శాంసన్ బౌండరీలతో విరుచుకుపడగా, మాత్రే అతనికి చక్కటి సహకారం అందించాడు.

ఈ క్రమంలో రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. మాత్రే కూడా కేవలం 36 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అతను 'రిటైర్డ్ అవుట్'గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే (10 బంతుల్లో 20 నాటౌట్) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. శాంసన్‌తో కలిసి ఆఖరి 15 బంతుల్లోనే 37 పరుగులు జోడించాడు.

మరోవైపు, ఢిల్లీ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. టి. నటరాజన్ 4 ఓవర్లలో ఏకంగా 54 పరుగులు సమర్పించుకోగా, లుంగి ఎంగిడి 41 పరుగులు ఇచ్చాడు. కెప్టెన్ అక్షర్ పటేల్ ఒక వికెట్ తీసినప్పటికీ, 39 పరుగులు ఇచ్చి ఖరీదైన బౌలర్‌గా నిలిచాడు.

టీ20 ప్రపంచకప్ హీరో సంజూ శాంసన్ ఎట్టకేలకు ఫామ్ అందుకున్నాడు. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తరఫున ఆడుతున్న అతను, ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మెరుపు అర్ధశతకం సాధించాడు. చెపాక్ స్టేడియం వేదికగా చెలరేగిన సంజూ, ఈ సీజన్‌లో తన తొలి హాఫ్ సెంచరీని నమోదు చేశాడు.

ఈ సీజన్‌లో ఆడిన తొలి మూడు మ్యాచ్ లలో విఫలమై నిరాశపరిచిన సంజూ, ఈ మ్యాచ్‌లో మాత్రం ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. ఢిల్లీ బౌలర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కేవలం 26 బంతుల్లోనే 9 ఫోర్ల సాయంతో 50 పరుగుల మార్కును అందుకున్నాడు. ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో సింగిల్ తీసి సీఎస్కే తరఫున తన తొలి హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

పసుపు జెర్సీలో ఇదే తొలి అర్ధశతకం కావడంతో సంజూ ఎంతో ఆనందంగా కనిపించాడు. తన కలల జట్టు అయిన చెన్నై తరఫున రాణించాలన్న పట్టుదలతో బరిలోకి దిగిన అతను, ఎట్టకేలకు తన బ్యాట్ పవర్ చూపించాడు. ప్రస్తుతం సంజూ 43 బంతుల్లో 90 పరుగులతో సెంచరీ దిశగా కొనసాగుతున్నాడు. చెన్నై జట్టు 15 ఓవర్లు ముగిసేసరికి ఒక వికెట్ నష్టానికి 160 పరుగులు చేసింది.



# అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్.. సన్‌రైజర్స్‌పై భారీ టార్గెట్‌ను ఊదేసిన పంజాబ్



ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద కొనసాగుతోంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (69 నాటౌట్), ప్రియాన్ష్ ఆర్య (57), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (51) హాఫ్ సెంచరీలతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ సన్‌రైజర్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో పంజాబ్ గెలుపు సులువే అనిపించింది. అయితే, సన్‌రైజర్స్ బౌలర్ శివాంగ్ కుమార్ (3/33) ఒకే ఓవర్‌లో వీరిద్దరినీ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తనదైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (38)తో కలిసి తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరి దూకుడుతో సన్‌రైజర్స్ భారీ స్కోరు చేయగలిగినా, బౌలర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ చరిత్రలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. డే/నైట్ మ్యాచ్‌లో 215కు పైగా పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన తొలి జట్టుగా నిలిచింది. ఈ భారీ ఛేదనతో పంజాబ్ జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు కాగా, మరోసారి బౌలింగ్‌లో విఫలమైన సన్‌రైజర్స్ కు నిరాశ తప్పలేదు.

## ఊచకోత.. చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఇవాళ (ఏప్రిల్ 11) జరుగుతున్న మ్యాచ్‌లో 18 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేయడంతో ఐపీఎల్ చరిత్రలో 20 లోపు బంతుల్లో 5 హాఫ్ సెంచరీలు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. అభిషేక్ తన ఐపీఎల్ కెరీర్‌లో 16 బంతుల్లో ఓసారి.. 18 బంతుల్లో రెండు సార్లు, 19 బంతుల్లో మరో రెండు సార్లు హాఫ్ సెంచరీలు చేశాడు.

ఈ విభాగంలో అభిషేక్ తర్వాతి స్థానంలో నికోలస్ పూరన్ ఉన్నాడు. పూరన్ 4 సార్లు ఐపీఎల్‌లో 20 లోపు బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేశాడు. అభిషేక్, పూరన్ తర్వాతి స్థానాల్లో జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (3), వైభవ్ సూర్యవంశీ (3) ఉన్నారు.

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. అభిషేక్ 28 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 74 పరుగులు చేశాడు. ట్రవిస్ హెడ్ 23 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్ సాయంతో 38 పరుగులు చేశాడు. ఇషాన్ కిషన్ 17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్ సాయంతో 27, క్లాసెన్ 33 బంతుల్లో ఫోర్, సిక్సర్ సాయంతో 39 పరుగులు చేశాడు. మిగతా ఆటగాళ్లలో అనికేత్ వర్మ 18, సలీల్ అరోరా 9 పరుగులు చేయగా.. నితీశ్ 0, హర్ష్ దూబే ఒక్క పరుగుతో అజేయంగా నిలిచారు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, శశాంక్ సింగ్ తలో 2, జేవియర్ బార్ట్‌లెట్ ఓ వికెట్ తీశారు.

# విస్తరిస్తున్న డేటా సెంటర్లు.. భారీగా పెట్టుబడులు

### ఈ-టూవీలర్స్‌లోనూ పెద్ద కంపెనీలే..

హీరో మోటోకార్ప్, హెూండా, టీవీఎస్, బజాజ్, సుజుకీ, యమహా.. భారత ద్విచక్ర వాహన మార్కెట్లో ఈ కంపెనీలదే రాజ్యం. మారుమూల పల్లెల్లోనూ ఈ బ్రాండ్ల వాహనాలే దర్శనమిస్తాయి. సువిశాల భారతావని అంతటా ఇవి తమ నెట్‌వర్క్‌ను దశాబ్దాలుగా పెంచుకున్నాయి. విక్రయ శాలలే కాదు సర్వీసింగ్‌ను కూడా కస్టమర్లకు చేరువ చేశాయి. మాస్ మార్కెట్‌ను పూర్తిగా ఇవి చేతుల్లోకి తీసుకున్నాయంటే ఆశ్చర్యంవేయక మానదు.



హైదరాబాద్-,ఇంత బలమున్న ఈ దిగ్గజాలు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలోనూ పాగా వేస్తాయనడంలో సందేహం లేదు. ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ బజాజ్, టీవీఎస్ తమ సత్తా చాటుతున్నాయి. హీరో మోటోకార్ప్ క్రమక్రమంగా వేగం పెంచి నవంబర్‌లో టాప్-5 స్థానానికి ఎగబాకింది. పెద్ద కంపెనీలే ఈ-టూవీలర్స్‌లోనూ అడ్డా వేస్తాయని గణాంకాలు చెబుతున్నాయి. భారత ఈ-టూవీలర్స్ పరిశ్రమ ఈ ఏడాది నవంబర్ 11 నాటికే 10,00,000 యూనిట్ల మైలురాయిని దాటింది.

### మళ్లీ హమారా బజాజ్..

2024 డిసెంబర్ తొలి వారంలో అమ్ముడైన ఎలక్ట్రిక్ టూ వీలర్స్‌లో టాప్-4 కంపెనీల వాటా ఏకంగా 82 శాతం ఉందంటే భవిష్యత్ ఎలా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. మిగిలిన 18 శాతం వాటా కోసం దేశవ్యాప్తంగా 200లకుపైగా బ్రాండ్లు పోటీపడుతున్నాయి. భారత స్కూటర్స్ మార్కెట్లో ఒకప్పుడు రారాజులా వెలుగొందిన బజాజ్.. ఇప్పుడు ఎలక్ట్రిక్ చేతక్ రూపంలో స్కూటర్స్ విభాగంలోకి రీఎంట్రీ ఇచ్చి హమారా బజాజ్ అనిపించుకుంటోంది. డిసెంబర్ తొలివారంలో బజాజ్ 4,988 యూనిట్లతో తొలి స్థానంలో నిలిచింది. టీవీఎస్ మోటార్ కంపెనీ 3,964 యూనిట్లతో రెండవ స్థానంలో ఉంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది. ఓలా 3,351, ఏథర్ ఎనర్జీ 2,523 యూనిట్లతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఓలా అమ్మకాలు అక్టోబర్‌లో 41,775 యూనిట్ల నుంచి నవంబర్‌లో 29,191 యూనిట్లకు పడిపోయింది. దేశవ్యాప్తంగా ఈ కంపెనీ వాహనాల నాణ్యతపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడం గమనార్హం.

### పెద్ద కంపెనీల మధ్యే పోటీ..

తదుపరితరం చేతక్‌ను డిసెంబర్ 20న ప్రవేశపెట్టేందుకు బజాజ్ రెడీ అయింది. 2019-20లో కేవలం 212 యూనిట్లు విక్రయించిన బజాజ్.. 2020-21లో 1,395 యూనిట్లు, ఆ తర్వాతి ఏడాది 8,187, 2022-23లో 36,260 యూనిట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలో 1,15,702 యూనిట్లను సాధించింది. 2024-25 ఏప్రిల-నవంబర్‌లో 1,34,167 యూనిట్లు రోడ్డెక్కాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ 2023 జనవరిలో 10,465 యూనిట్ల సేల్స్ నమోదు చేసింది. ఏడాదిలోనే ఈ సంఖ్య 47 శాతం పెరిగింది. 2024 నవంబర్‌లో ఈ కంపెనీ 26,971 యూనిట్ల అమ్మకాలను దక్కించుకుంది. ఈ నెలలోనే విడా వీ2 మోడల్‌ను ఆవిష్కరించిన హీరో మోటోకార్ప్ క్రమక్రమంగా ఈ-టూవీలర్స్‌లో పట్టు సాధిస్తోంది. ఈ కంపెనీ 2023 జనవరిలో 157 యూనిట్లు విక్రయించింది. 2024 జనవరిలో ఈ సంఖ్య 1,495కు చేరుకుంది. నవంబర్‌లో ఏకంగా 7,309 యూనిట్ల అమ్మకాలను సాధించి టాప్-5 స్థానాన్ని అందుకుంది.

### క్యూలో మరిన్ని దిగ్గజాలు..

2025 తొలి త్రైమాసికం నుంచి నేను సైతం అంటూ హెూండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా రెడీ అవుతోంది. యాక్టివా-ఈ, క్యూసీ1 మోడళ్లను కంపెనీ భారత మార్కెట్లో ఇటీవలే ఆవిష్కరించింది. 2025 జనవరి 1 నుంచి బుకింగ్స్ స్వీకరిస్తారు. ఫిబ్రవరి నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయని కంపెనీ ప్రకటించింది. సంస్థకు దేశవ్యాప్తంగా 6,000 పైచిలుకు సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్స్ ఉన్నాయి. 2025లో 1,00,000 యూనిట్ల ఈ-స్కూటర్స్ తయారు చేయాలని లక్ష్యంగా చేసుకుందంటే కంపెనీకి ఉన్న ధీమా అర్థం చేసుకోవచ్చు. మరోవైపు సుజుకీ, యమహా ఎంట్రీ ఇస్తే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన పరిశ్రమ సరికొత్త రికార్డుల దశగా దూసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. యమహా ఇప్పటికే హైబ్రిడ్ టూ వీలర్స్ తయారు చేస్తోంది. సుజుకీ నియో ఎలక్ట్రిక్ టూ వీలర్ కొద్ది రోజుల్లో రంగ ప్రవేశం చేయనుంది.

నేటి శుభోదయ

ఆదివారం - 12 - ఏప్రిల్ - 2026

# రియా బోల్డ్ డెనిమ్ లుక్ వైరల్



ఊహించనిది జరిగితే దానిని ఎదుర్కోవడమే ధైర్యవంతుని లక్షణం. అలాంటి ధైర్యం తనకు ఉందని నిరూపించింది రియా చక్రవర్తి. తూనీగ తూనీగ సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన రియా చక్రవర్తి బాలీవుడ్ యువహీరో సుశాంత్ సింగ్ తో ప్రేమాయణం సాగించడం, డ్రగ్స్ స్కామ్, మనీలాండరింగ్‌లో తన పేరు వినిపించడం, అనంతరం సుశాంత్ ఆత్మహత్య వగైరా సంచలనాలు అయ్యాయి. ఈ కేసులో రియా చక్రవర్తి అరెస్టయి జైలులో కొన్ని నెలలపాటు ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం బెయిల్ పై బయటే ఉన్న రియా తిరిగి తన జీవితాన్ని కొత్త కోణంలో చూపించేందుకు చేయని ప్రయత్నం లేదు. రియా చక్రవర్తి తన మాజీ ప్రియుడు, నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ జూన్ 2020లో మరణించిన తర్వాత తనపై వచ్చిన అభియోగాలు క్లియర్ కావడానికి ముందు కొంతకాలం జ్యుడీషియల్ రిమాండ్‌లో కూడా ఉంది. దీనిపై అప్పట్లో హ్యూమన్స్ ఆఫ్ బాంబేతో మాట్లాడిన రియా, వీటన్నింటికీ ముందు తాను భ్రమలతో కూడుకున్న ఆశావాదిని అని తెలిపింది. తాను ఎప్పుడూ తన పనిని ఆస్వాధించాలనుకుంటానని, ఎలాంటి లక్ష్యాలు లేకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటానని రియా చక్రవర్తి అన్నారు. ఆరోపణల కారణంగా..దేశం మొత్తం నాపై ఎలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉంటుందో, మంచి లేదా చెడును మరచిపోతుందని నేను కచ్చితంగా ఊహించలేను! నటిగా కూడా నా ఆశయం ఎప్పుడూ నంబర్ 1 కాదు.. నేను ఒక క్రాఫ్ట్‌గా నటనను ఆస్వాధించడం ప్రారంభించాను. దాని గురించి లక్ష్యాలు లేవు. జగరబోయేదానికి ఎవరూ నన్ను సిద్ధం చేయలేదు. వారు నన్ను.. చుడైల్, కాలా జాదు కర్నే వాలీ, నాగిన్ లాంటి పేర్లతో పిలుస్తారు.. కానీ నేను దేనినీ నిజంగా పట్టించుకోను. ఇలాంటివి ఇంతకుముందు నన్ను కలవరపెట్టేవి కానీ ఇప్పుడు కాదు! అని తెలిపింది. అయితే రియా తన జీవితాన్ని తిరిగి పొందాలంటే %-%క్షమించే మార్గం%-%లో వెళ్ళవలసిందిగా భావించానని, దాదాపు బలవంతంగా ఇది జరిగిందని చెప్పింది. జరిగి నదంతా క్షమించాలని నా హృదయంలో ఉంటుందని నేను అనుకోలేదు. కానీ నేను చాలా కాలంగా చాలా కోపంగా ఉన్నందున క్షమాగుణం సింపుల్ మార్గంగా మారింది. నాకు వచ్చిన కోపం అంతా గట్ సమస్యలు.. అసిడిటీ మాత్రమే. నేను దాదాపు మూడేళ్లపాటు ఎసిడిటీతో చాలా బాధపడ్డాను. క్షమాపణ ఒక్కటే ఆప్షన్‌గా మారింది. నేను దాదాపు క్షమాపణ మార్గంలోకి వెళ్ళవలసి వచ్చింది.. అని తెలిపింది. 2020లో సుశాంత్ మరణించిన తర్వాత, రియా అతడి ఆత్మహత్యకు ప్రేరేపించిందని ఆరోపణలు వచ్చాయి. మనీలాండరింగ్ ఆరోపణలపై రియాను ఆమె సోదరుడు షోక్‌ను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కేసును స్వాధీనం చేసుకున్న తరువాత, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) సుశాంత్‌కు గంజాయి సరఫరా చేశారనే ఆరోపణతో రియాను ఆమె సోదరుడిని అరెస్టు చేసింది. అయితే సుశాంత్ డ్రగ్స్ వ్యసనానికి రియా ఆర్థిక సహాయం చేసిందనే ఎన్‌సిబి సిద్ధాంతాన్ని బాంబే హైకోర్టు తిరస్కరించింది.



రియా వరుస ఫోటోషూట్లు: రియా చక్రవర్తి ఇటీవల గతాన్ని మరిచి యాక్టివ్ గా ఉంటోంది. సోషల్ మీడియాల్లో నిరంతరం తన లేటెస్ట్ ఫోటోషూట్లను షేర్ చేస్తూ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది. ఒక వివాదం తర్వాత తనకు అవకాశాలిచ్చేవారు కరువయ్యారు. కానీ మొక్కవోని దీక్షతో తన వంతు ప్రయత్నాలను ఆపడం లేదు. ఇటీవల సోషల్ మీడియాల్లో రియా గ్లామ్ ఫోటోగ్రాఫ్స్ వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజా ఫోటోషూట్ లో రియా డెనిమ్స్ లో స్టన్నింగ్ లుక్ తో కనిపించింది. ఓవైపు డెనిమ్స్ ధరించినా ఇన్నర్ అందాలను ఎలివేట్ చేయడంలో రియా ఎక్కడా తగ్గలేదు. మెడలో గోల్డ్ పెండెంట్ చైన్ రియా అందాలను స్పైసప్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్

# జీవనశైలి, ఆహారం హెూమియోపతి చికిత్సల ప్రభావాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?




లైఫ్ : పిల్లలు, గర్భిణీ స్త్రీలకు హెూమియోపతి సురక్షితమేనా..?హెూమియోపతి ప్రత్యేకించి ప్రభావవంతంగా ఉండే నిర్దిష్ట పరిస్థితులు లేదా వ్యాధులు ఏమైనా ఉన్నాయా? చికిత్స ప్రక్రియలో హెూమియోపతి ప్రాక్టీషనర్ ఏ పాత్ర పోషిస్తాడు? హెూమియోపతి మందులు ఎలా తయారు చేస్తారు? సాంప్రదాయ వైద్యంతో పోలిస్తే హెూమియోపతి వైద్యం ఎలా పనిచేస్తుంది? దీర్ఘకాలిక రోగాలకు హెూమియోపతి మందులు ప్రభావవంతంగా పనిచేస్తాయా? హెూమియోపతి మందులు పనిచేసే విషయంలో శాస్త్రీయ ఆధారాలేమైనా ఉన్నాయా..? సాంప్రదాయ వైద్య చికిత్సలతో పాటు హెూమియోపతి మందులు తీసుకోవచ్చా..? క్యాన్సర్ కు హెూమియోపతిలో చికిత్స ఉందా..? దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు హెూమియో వైద్యంతో తగ్గుతాయా..? హెూమియో మందులు తీసుకుంటే ఏమేమి తినకూడదు..? హెూమియోపతి వైద్య విధానంలో ఎలాంటి వ్యాధులు తొందరగా తగ్గుతాయి..? అల్లోపతి మందులతో పాటు హెూమియోపతి మందులు వాడొచ్చా..? దీనివల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయా..? హెూమియో మందులు వాడేటప్పుడు ఆహార నియమాలు పాటించాలా..?హెూమియోపతి అంటే ఏమిటి..?అది ఎలా పని చేస్తుంది? హెూమియోపతి మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు ఏమిటి? హెూమియోపతి చికిత్స ఫలితాల విషయంలో సాధారణంగా ఎంత సమయం పడుతుంది..? ఒక నిర్దిష్ట పరిస్థితికి హెూమియోపతి నివారణను ఎలా ఎంచుకోవాలి? హెూమియోపతి చికిత్స ద్వారా ఎలాంటి వ్యాధులు తొందరగా నయమవుతాయి..? ఈ అంశాలకు సంబంధించి ప్రముఖ హెూమియో వైద్య నిపుణులు మధు వారణాసి సాక్షిలైఫ్ కు వివరించారు. ఈ కింది వీడియో చూసి ఆ విశేషాలు ఆయన మాటల్లోనే తెలుసుకోండి.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.





# చీరందంలో షేక్ చేసిన షాకింగ్ బ్యూటీ!



బాలీవుడ్ బ్యూటీ ఫాతిమా షనా షేక్ సుపరిచితమే. చైల్డ్ ఆర్టిస్ట్ గా ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ 'దంగల్' సినిమాతో దేశమంతా ఫేమస్ అయింది. ఆ ఒక్క పాత్ర ఫాతిమా బాలీవుడ్ కెరీర్ నే మార్చేసింది. గీతా ఫోగాట్ పాత్రలో అమ్మడు అభినయించిన తీరు గొప్ప పేరును తీసుకొచ్చింది. ఆ పాత్రలో ఫాతిమా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ ఎన్నో ప్రశంసలు తెచ్చి పెట్టింది. ఆ సినిమా తర్వాత నటిగా బిజీ అయింది. / అంతకుముందు మెయిన్ లీడ్స్ లో కొన్ని సినిమాలు చేసినా..ఏ సినిమా తీసుకురాని గుర్తింపు దంగల్ తీసుకొచ్చింది. ఆ రకంగా ఫాతిమ కెరీర్ లో దంగల్ ఓ గొప్ప చిత్రంగా నిలిచిపోయింది. ఇప్పటికీ అదే క్రేజ్ తో అవకాశాలు అందుకుంటుంది. కానీ ఆ రేంజ్ సక్సెస్ మాత్రం రావడం లేదు. -థగ్స్ ఆఫ్ హిందుస్తాన్- ..-లుడో-.. -సురాజ్ పే మంగల్ బారీ -.. -అజీబ్ దస్తాన్స్ -..-థార్-..-ధక్ ధక్- లాంటి సినిమాలు చేసినా కలిసి రాలేదు. గతేడాది రిలీజ్ అయిన సామ్ బహదూర్ మాత్ర ఊరటనిచ్చిన చిత్రంగా నిలిచింది. వీటన్నింకటే ముందే అమ్మడు టాలీవుడ్ లో %-%నువ్వు నేను ఒకటవుదాం- అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయి తెలుగులో అవకాశాలు వచ్చి ఉంటే ఇక్కడే ఉండేదేమో. కానీ అలా జరగలేదు. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండటం రేర్. అప్పుడప్పుడు ఫోటోలు పోస్ట్ చేసినా? పద్ధతైన ఫోటోలతోనే మెప్పించే ప్రయత్నం చేస్తుంది. అమ్మడు గ్లామర్ షోకి దూరంగా ఉంటుంది. చాలా రేర్ గానే స్కిన్ షో చేస్తుంది. తాజాగా ఫాతిమా చీరందంలో తళుకులీనింది. లైట్ పింక్ బ్యాక్ గ్రౌండ్ ని మ్యాచ్ చేస్తూ క్రీమ్ కలర్ సారీలో ఒదిగిపోయింది. షోల్డెర్ లెజ్ బ్లౌజు సొగసైన ఫోజులిచ్చింది. చెవులకు దిద్దులు ధరించింది అమ్మడి మ్యాకప్ అలకంరణ ప్రతీది మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఈసారి మాత్రం కాస్త స్కిన్ షోకి ఛాన్స్ ఇచ్చింది. టోన్డ్ బాడీని హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. నడుము ఒంపు సొంపుల్లో యద అందాలతో మైమరిపించింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతోంది.

# రకుల్ వేగం అక్కడా తగ్గినట్లుందే!



గడిచిన రెండేళ్ల కాలంలో రకుల్ ప్రీత్ సింగ్ ఏ రేంజ్ లో సినిమాలు చేసిందో చెప్పాల్సిన పనిలేదు. వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టలేదు. చిన్న పెద్ద అనే సినిమా లేకుండా పనిచేసింది. ఒకానొక దశలో అమ్మడి వేగం చూసి కిలాడీ అక్షయ్ కుమార్ నే పక్కకు నెట్టేస్తుందా? అన్న సందేహం సైతం తెరపైకి వచ్చింది. అంతటి ఇబ్బడి ముబ్బడిగా సినిమాలు చేసింది. అయితే 2024లో మాత్రం ఆ వేగంగా బాగా తగ్గింది. / ఇప్పటి వరకూ ఈ ఏడాది కేవలం - ఆయలాన్-, - ఇండియన్-2 - సినిమాలతో మాత్రమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. వీటిలో ఆయలాన్ మాత్రమే సక్సెస్ అయింది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఇండియన్-2 మాత్రం డిజాస్టర్ గా మిగిలింది. మరి ప్రస్తుతం అమ్మడి లైనప్ ఎలా ఉంది? అంటే పూర్తిగా డల్ గానే కనిపిస్తోంది. %-% ఇండియన్ -2 - కి కంటున్యూటీగా -ఇండియన్-3%-% లోనూ కనిపిస్తుంది. కాబట్టి ఆ చిత్రాన్ని కౌంట్ చేయాల్సిన పనిలేదు. మరి చేతిలో ఉన్న సినిమా లెక్క? ఏంటి అంటే కేవలం ఒక్క చిత్రం మాత్రమే ఉంది. అదే %-%దే దే ప్యార్ దే-2%-%. ఈ సినిమా తప్ప ఇంకే సినిమా చేతిలో లేదు. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ అవుతుంది. అంతవరకూ రకుల్ సినిమాల కోసం ఎదురు చూడాల్సిన పనిలేదు. మొత్తంగా చూస్తే రకుల్ డైరీ ఇప్పుడు పూర్తి ఖాళీగా కని పిస్తుంది. సక్సెస్ వస్తే తప్ప కొత్త సినిమాలు వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఇక సోషల్ మీడియాలో మాత్రం అమ్మడు నిత్యం యాక్టివ్ గానే కొనసాగుతుంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో కుర్రాళ్లను హీటెక్కిస్తుంది. పెళ్లైనా అమ్మడు ఏమాత్రం వేగం తగ్గించలేదు. తాజాగా ఎల్లో ఇండియా కవర్ పేజీపై తళుక్కున మెరిసింది. బ్లూ కాంబినేషన్ దుస్తుల్లో మిరుమిట్లు గొలుపుతుంది. అమ్మడి మ్యాకప్ అలంకరణ ప్రతీది రకుల్ బ్యూటీని అంతకంతకు రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మా



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571515 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .